క్లుప్తంగా

హెల్మెట్ ధారణ తప్పనిసరి

బుట్టాయగూడెం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఎస్సై కె. వెంకన్న కోరారు. స్థానిక బస్ స్టాప్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్, లైసెన్స్ లేకుండా ఉన్న 10 మంది ద్విచక్ర వాహనదారులకు ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాక్సిడెంట్‌లో ఎక్కువ మంది తలకు గాయాలు కావడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకోవచ్చన్నారు.

ప్రత్యేక కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో నిత్యావసర సరుకుల అమ్మకానికి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆయన పోలవరంలో శుక్రవారం చోడిశెట్టి రాంబాబు కిరాణా షాపు వద్ద ఈ ప్రత్యేక కౌంటర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. కందిపప్పు కేజీ రూ.160, బియ్యం కేజీ రూ.48 అమ్మకం చేస్తామని తెలిపారు. కొణతాల ప్రసాద్, నాళం గాంధీ, గునపర్తి చిన్న, సిగ్గన రామకృష్ణ, కరిబండి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

కామవరపుకోట: వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహనీయులు మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘ సభ్యులు చిన్ని రామ సత్యనారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రానికి గాంధీజీ, ఆంధ్ర రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, ఆర్య వైశ్యులు సహాయ సహకారాలు అందించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీఆర్ రమేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు వందనపు జగన్నాథరావు, మురళీకృష్ణ, పురుషోత్తమరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆవుల అక్రమ రవాణాపై కేసు

జంగారెడ్డిగూడెం: ఎటువంటి అనుమతులు లేకుండా ఆవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మార్కెట్ యార్డు వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఎటువంటి అనుమతులు లేకుండా 12 ఆవులను తరలిస్తుండటాన్ని గుర్తించామన్నారు. పశువుల రవాణాపై విచారణ నిర్వహించగా, వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆవులను తుని నుంచి పాయకరావుపేటకు తరలిస్తున్నారని ఆయన చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశామని, ఆవులను హనుమాన్ జంక్షన్ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కిడ్నీ బాధితుడికి చేయూత

ద్వారకాతిరుమల: మండలంలోని రామన్నగూడెంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, గ్రామస్తులు, యువకులు రూ.57 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పెచ్చేటి వీరాంజనేయులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో బాధితుడికి ఆర్థిక సహాయం అందించారు. దేవరపల్లి రాయుడు బాబు, కూనపాము రామారావు, కోశాధికారి నాదెళ్ల బుల్లి వెంకట్రావు, చిలుకూరి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభం

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని వర్షం నీరు బయటకు మళ్లించే పనులు చేస్తున్నామని సర్పంచ్ పాడుం పుష్ప తెలిపారు. వర్షం నీరు బయటకు పోయేందుకు పక్కా డ్రెయిన్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యడ్లగూడెం, నూతనగూడెం ప్రాంతాల్లోని 13, 14 వార్డుల్లో వర్షపు నీరు దిగువకు వెళ్లేందుకు వీలుగా రూ.10 లక్షల నిధులతో పక్కా డ్రెయిన్ నిర్మాణాన్ని సర్పంచ్ పాడుం పుష్ప ప్రారంభించారు.

కేబుల్ వైర్లు క్రమబద్ధీకరించాలి

కొయ్యలగూడెం: కేబుల్ వైర్లను క్రమబద్ధీకరించాలని, అడ్డగోలు కనెక్షన్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ స్తంభాలను కేబుల్ కలెక్షన్లకు ఉపయోగించడం వలన తరచూ విద్యుత్ వినియోగదారులకు అవాంతరాలు ఎదురవుతున్నాయన్నారు. కొన్నిసార్లు విద్యుత్ కనెక్షన్లు షార్ట్ సర్క్యూట్ కావడానికి కేబుల్ వైర్లే కారణం అవుతున్నాయని ఆరోపించారు. దీనిపై అధికారులకు గతంలోనే కన్స్యూమర్ ఆర్గనైజేషన్ తరఫున వివరణ కోరామని, ఇప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కన్స్యూమర్ ఫోరం తరఫున విద్యుత్ శాఖ అధికారులు బాధ్యులవుతారన్నారు. దీనిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ విషయమై ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

వర్షాలకు ఏజెన్సీ అతలాకుతలం

దెబ్బతిన్న కల్వర్టులు, చెక్‌డ్యామ్‌లు



జల్లేరు వాగు ప్రవాహానికి కల్వర్టు సగ భాగం కొట్టుకుపోయి వాగులో ఉన్న దృశ్యం



రెడ్డి గణవరం సమీపంలో వర్షానికి కొట్టుకుపోయిన పుంత చెరువుకు వెళ్లే రోడ్డు



వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన జల్లేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్

బుట్టాయగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొండవాగులు పొంగి అనేక చోట్ల కల్వర్టులు, చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతం అతలకుతలం అయ్యింది. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగు కల్వర్టు సగంభాగం కొట్టుకుపోయి కాల్వలో ఉండిపోయింది. అయితే కల్వర్టు కొంతభాగం మేరకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ఆ రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా రెడ్డిగణపవరం పుంత చెరువు నుంచి రోడ్డు కల్వర్టు కొట్టుకుపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. కల్వర్టు మార్గంలో మోకాలు లోతు వరకూ గుంతలు ఏర్పడ్డాయి. అదే విధంగా రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగుపై కుంత చెరువుకు కెనాల్‌కు నిర్మించిన చెక్ డ్యామ్ కూడా కొట్టుకుపోయింది. ఈ కెనాల్ ద్వారా సుమారు 700 మంది రైతులకు సాగునీటి సదుపాయం అందే అవకాశం ఉందని రైతులు చెబున్నారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ కొట్టుకుపోవడం వలన నీరు వృథాగా పోతూ ఎర్రకాలువలో కలుస్తుందని అధికారులు వెంటనే మరమ్మతు పనులు చేపట్టి చెక్‌డ్యామ్ నిర్మించాలని రైతు భౌమరాజు సత్యనారాయణరాజు కోరారు. అదే విధంగా కొట్టుకుపోయిన కల్వర్టుకు కూడా మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వరద బాధితులకు సహాయం



నిత్యావసరాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు



నిత్యావసరాల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీపీఎం నేతలు

- నిత్యావసరాలు పంపిణీ చేసిన సీపీఎం
- వాహనాలను ప్రారంభించిన సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం

జంగారెడ్డిగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత మండలాలైన కుకునూరు, వేలేరుపాడు మండలాలలో మునిగిన గ్రామాలు మరియు పెదవాగు ప్రాజెక్టు తెగి ముంపునకు గురైన గ్రామాలకు నిత్యావసరాలు అందజేసినట్లు సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిత్యావసర సరుకులు, కూరగాయలు, బట్టలు నూనె, బియ్యం, తదితర వస్తువులు పేదలకు అందజేయడానికి తీసుకువెళ్లే వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటికే సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి చొరవతో మండల నాయకులు రాష్ట్ర నాయకత్వం పర్యటించి, నిత్యవసర సరుకులు, భోజనాలు, మందులు అందజేశామన్నారు. గోదావరి ముంపు బాధితులను, నిర్వాసితులను ఆదుకోవటంలో వారికి అండగా ఉండటంలో 10 సంవత్సరాల నుంచి సీపీఎం ఎనలేని కృషి చేస్తుందని పేర్కొన్నారు. కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాలలో ఈ సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, టి.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, గుడెల్లి వెంకటరావు, ఎం.జీవరత్నం, యర్రంశెట్టి నాగేంద్రం, ధర్మల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో

వేలేరుపాడు: పెదవాగు ప్రాజెక్టు వరద బాధితులకు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెదవాగు ప్రాజెక్టు గండి పడి గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. సర్వం కోల్పోయిన వరద బాధితులకు సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, సూర్యారావు, సీతారామయ్య, కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మలేరియాపై అవగాహన ర్యాలీ, నివారణ కార్యక్రమం కొయ్యలగూడెం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్రైడే డ్రైడే పురస్కరించుకొని వైద్యాధికారిణి ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అదే విధంగా నివారణ చర్యలు మలేరియా సంక్రమిస్తే సంక్రమించే లక్షణాలు గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ, కలుషితనీరు తీసుకోకుండా జాగ్రత్తలు కాచి చల్లార్చిన నీటిని దాహానికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి ఫీల్డ్ సిబ్బందితో రక్త పరీక్షలు నిర్వహించి, జ్వరాల నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఎంపీహెచ్‌వో సీహెచ్ రంగారావు, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలి



నినాదాలు చేస్తున్న ఇఫ్టు నాయకులు

జంగారెడ్డిగూడెం: దళితులు ఆదివాసీల ఉపాధి మెరుగుదలకై ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేసి అమలు చేయాలని ఇఫ్టు రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. ఇఫ్టు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జంగారెడ్డిగూడెంలో గంపల శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ జులై 17 నుంచి ఆగస్టు 6 వరకు దళితుల ఆత్మ రక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. దళిత, ఆదివాసీలను అభివృద్ధి పథంలో తీసుకు రావడానికి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను అమలు చేసి వారి ఉపాధి కల్పనకు రుణాలు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని, మురికివాడల్లోని రోడ్ల అభివృద్ధి కోసం ఈ నిధులను ఉపయోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్దిపాటి లక్ష్మయ్య, గంపల శ్రీను, రామకృష్ణ, మర్లపాటి సుబ్బారావు, యండ్రపాటి శ్రీను, వసంతాటి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



దోమల నివారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామరాజు

చింతలపూడి: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు ప్రబలకుండా నిరోధించొచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి రామరాజు, పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రగడవరం శివారు శ్రీరామ్‌పురంలో చేపట్టిన దోమల నివారణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని మూడు రోజులకోసారి నీటి వనరులు శుభ్రపరచుకోవాలని ఆయన పేర్కొన్నారు. చింతలపూడి ఈవోపీఆర్‌డీ, అధికారి ప్రసాద్, అబ్రార్ హుస్సేన్ శ్రీనివాసరావు, ప్రగడవరం సర్పంచ్ పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా కన్యకా పరమేశ్వరి

కొయ్యలగూడెం: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని శుక్రవారం శాకంబరీదేవిగా అలంకరించారు. శ్రీ వాసవి అమ్మవారితో పాటుగా శ్రీ మహాలక్ష్మి, సరస్వతి అమ్మవార్లకు, మీనాక్షి సుందరేశ్వరస్వామికి, విఘ్నేశ్వర స్వామి, ఆంజనేయస్వామికి శాకంబరి అలంకరణ చేసి అర్చకులు మామిళ్లపల్లి దేవీతారాం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి పారాయణం అనంతరం ప్రత్యేకంగా తయారు చేయబడిన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. బయ్యనగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని అర్చకులు వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన పూజలలో మహిళలు పాల్గొన్నారు.

డైమండ్ క్లబ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన డైమండ్ క్లబ్ సభ్యులు

లింగపాలెం: డైమండ్ క్లబ్ ధర్మాజీగూడెం ఆధ్వర్యంలో శుక్రవారం డాన్ టు డస్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైమండ్ క్లబ్ సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. రామాలయంలో కూర్చోవడానికి రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. కనకదుర్గమ్మ గుడిలో అమ్మవారికి చీర, పసుపు కుంకుమ సమర్పించారు. సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి ఒక స్టీల్ గుండిగ అందజేశారు. వీధి వ్యాపారం చేసుకునే వారికి వర్షాకాలం సందర్భంగా గొడుగులు, పేదవారికి బియ్యం, కూరగాయలు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పోలీస్ శాఖ వారికి మాస్కులు, కండువాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధికారులు ఐఈసీ ఆఫీసర్ సీహెచ్ కిషోర్, ఐపీసీవో కె.రామకృష్ణ, ఆర్‌సీ మణిశ్రీ, పద్మిని, ధర్మాజీగూడెం వాసవి క్లబ్ ప్రెసిడెంట్లు సోమిశెట్టి గంగాధరరావు, కందుల రత్నమాల, సెక్రటరీలు సమయమంతుల బలరామకృష్ణ, కొలిపర్తి పుష్ప కుమారి, ట్రెజరర్స్ మన్యం పుల్లేశ్వరావు, సమయమంతుల రమాదేవి, ధర్మాజీగూడెం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధికారి భువనగిరి నాగభూషణ, సూర్య ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు : కేంద్ర బడ్జెట్ లో ఏపీకి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం కలిగిందని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి. వెంకటాచారి ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకపోవడంతో నిరాశ కలిగించిందన్నారు. 200 రోజుల పని దినాలు కల్పించాలని, వేతనాలు సకాలంలో సక్రమంగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరి వరద బాధితులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గోదావరి వరదలతో విలీన మండలాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, సాగుకు పెట్టుబడి సదుపాయాలు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరగలేదన్నారు. గోదావరి ముంపుకు గురైన రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ముంపు మండలాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే రహదారి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబూరావు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

జంగారెడ్డిగూడెం: సైనికుల వీరోచిత పోరాటాలు మన ప్రశాంత జీవనానికి దోహదపడతాయని, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, ఏపీ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత మాజీ సైనికులు, బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అప్పటి యుద్ధంలో భాగస్వాములైన జంగారెడ్డిగూడేనికి చెందిన నలుగురు యుద్ధ వీరులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగి నేటికి 25 సంవత్సరాలు అవుతుందన్నారు. నాడు పాకిస్తాన్ ముష్కరులు కాశ్మీర్‌ను ఆక్రమించేందుకు చేసిన కుటిలయత్నాన్ని మన సైనికులు వెనుకడుగు వేయకుండా వీరోచితంగా పోరాడి భగ్నం చేశారన్నారు. ఈ క్రమంలో 559 మంది సైనికులు అమరులయ్యారన్నారు. సుమారు 1560 మంది గాయపడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని నిర్వహించారు. సీఐ పి.రాజేష్, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి

కొయ్యలగూడెం: కార్గిల్ అమరవీరుల దినోత్సవం (కార్గిల్ దివస్) కార్యక్రమాన్ని శుక్రవారం కుంతల గూడెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్గిల్ వీరులను తలుచుకొని వారి ఆత్మకు శాంతి కలగాలని చిన్నారులు మౌనం పాటించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబాలకు భారతదేశం రుణపడి ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మహిళలు-చట్టాలపై అవగాహన సదస్సు



చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పి.రాజేష్

జంగారెడ్డిగూడెం: మహిళల రక్షణ కోసం అనేక రకాల చట్టాలు రూపొందించబడ్డాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని సీఐ పి.రాజేష్, ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ పాఠశాలలో శుక్రవారం మహిళలు-చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎంపీడీవోలు మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాజ్యాంగం పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించిందన్నారు. లింగ వివక్షతను రూపుమాపేలా అనేక చట్టాలు చేసిందన్నారు. స్త్రీని అగౌరవపరిచేలా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. బాలికా శిశు సంరక్షణచట్టం, కిశోర బాలికల పథకం, సబల, ఐజీఎం, ఎస్వై, ఐసీపీఎస్ తదితర పథకాలు అందిస్తుండగా, మహిళల రక్షణ కోసం గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధ చట్టం, వరకట్న వేధింపుల నిషేధ చట్టం, మహిళలు, పిల్లల అక్రమ రవాణా నిరోధక చట్టం, నిర్భయ చట్టం ఇలా అనేక చట్టాలు రూపొందించారన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ త్రినాథ్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎల్.ప్రశాంతి, అడ్వకేట్ హిమబిందు, ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా, సూపర్‌వైజర్‌లు లక్ష్మి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

టి.నరసాపురం: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ టి.క్రాంతి కుమార్ అన్నారు. టి.నరసాపురం ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం చిన్నారులు, కిషోర బాలికలు, మహిళల కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలు, అమలయ్యే తీరును తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారుల పట్ల జరిగే అఘాయిత్యాల నుంచి రక్షించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిలో పోక్సో చట్టం ఒకటన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఎస్సై, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. స్థానిక శ్రీనివాసపురం రోడ్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా పేకాడుతున్నారని తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2140 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక లారీ బోల్తా

ద్వారకాతిరుమల: స్థానిక యాదవ కాలనీ మలుపులో శుక్రవారం మధ్యాహ్నం ఒక ఇసుక లోడు లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఆ సమయంలో అటుగా ఏవిధమైన వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం నల్లజర్ల మండలం పోతవరం నుంచి ద్వారకాతిరుమలకు వస్తున్న ఇసుక లోడు లారీ ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి, విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి రావొద్దు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువైయున్న గుబ్బల మంగమ్మ దర్శనానికి ఇంకా అనుమతులు ఇవ్వలేదని ఆలయ కమిటీ ప్రతినిధి కోర్సా గంగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుడి సన్నిధి, పరిసర ప్రాంతాలు వాగు ప్రవాహానికి బాగా దెబ్బతిన్నాయని చెప్పారు. వీటికి మరమ్మతులు చేపట్టామని పనులు పూర్తయ్యే వరకూ మంగమ్మ దర్శనాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భక్తులు తమకు సహకరించాలని కోరారు. వాతావరణం అనుకూలించిన తర్వాత దర్శనాల తేదీలను ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సి.మధుబాబు, జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కోర్టు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 14 న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరి, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమాచారం కోసం దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కల్వర్టుకు మరమ్మతులు



కల్వర్టు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని బూరుగువాడ సమీపంలో ఇటీవల వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు మరమ్మతు పనులను సర్పంచ్ జోడే సత్య దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. సుమారు రూ.10 వేల వ్యయంతో కల్వర్టుపై తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టి వేపులపాడు, బూరుగువాడ, అంకన్నగూడెం, పందిరి మామిడిగూడెం గ్రామాల మధ్య ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా గ్రామస్తులు, పందిరిమామిడిగూడెం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పనులను పూర్తి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బట్టా వెంకటేశ్వరరావు, కుంజా భూమయ్య, కంగాల రాముడు, సుబ్బారావు, మడివి దుర్గారావు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల కరపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారికి ప్రీతికరమైన మాసం శ్రావణ మాసమన్నారు. మహాలక్ష్మి స్వరూపంగా అమ్మవారికి శ్రావణమాసంలో విశేష పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాన్ని భక్తుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ప్రతీ శుక్రవారం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ఏకాదశ హారతి పూజలు, వేద దర్బారు సేవ చతుర్వేద స్వస్తి పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.